



*(ప్రారంభం)*

**పెద్దకొడుకు వంశీ** రాసిన ఉత్తరం చదివి రవి కోపంతో ఊగిపోయాడు. భార్య ఇందిర అతని రియాక్షన్‌కి ఆశ్చర్యపోయింది. భర్త ఇంత కోపంగా ఉండటం ఎప్పుడూ చూడలేదు. ఆ ఉత్తరం వంశీ దగ్గరనుండి వచ్చినట్టు తెలుసు. అమెరికా విశేషాలతో రొటీన్‌గా రాసే మాములు ఉత్తరమే అయితే అంతగా రియాక్షన్ చూపించాలిసిన అవసరం లేదు. అయితే అందులో ఏముంది? రవి చదివి విసిరి కొట్టిన ఉత్తరాన్ని తీసి చదివింది.

"నాన్నగారూ! నమస్కారం. ఇక్కడ మేమంతా క్షేమం. మీరూ క్షేమమని తలుస్తాను. ఇప్పుడు మీకొక అన్ ప్లెజంట్ విషయం గురించి రాయక తప్పడం లేదు. అన్యధా భావించకండి.

ఇప్పుడు మనం ఉంటున్న ఇల్లు రెండు పోర్షన్స్‌గా ఉంది. పెద్ద పోర్షన్‌లో నేను నా కుటుంబం, చిన్న పోర్షన్‌లో మీరూ, అమ్మ ఉంటున్నారు. ఈ ఇల్లు కొనడానికి మీరు కొంత సహాయం చేశారు. అందువలన మీరూ అమ్మ మీ జీవితాంతం ప్రశాంతంగా ఆ పోర్షన్‌లో ఉండాలని, ఉంటారని అందరం భావించాం. కానీ ప్రస్తుతం నా అత్తమామలకు అనుకోని అవాంతరం వచ్చింది. వాళ్ళ ఏకైక కుమారుడు వాళ్ళని కాదని లక్నో ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు. మీకు తెలిసిందే ప్రస్తుతం వాళ్ళుంటున్నది అద్దె అపార్ట్‌మెంట్. అద్దెకూడా ఎక్కువ. అది భరించే స్థితి ఆయనకు లేదు. ఈ నెలాఖరులోగా వాళ్ళు ఖాళీ చేయాలట. అందుకోసమని వాళ్ళని ఇక్కడకే రమ్మని నా

భార్య చెప్పిందట. వాళ్ళు రేపు ఫస్టుకల్లా వచ్చి ప్రస్తుతం మీరుంటున్న పోర్షన్‌లో ఉంటారు. నా భార్యకు చిన్నపిల్లాడిని చూడటంలో తోడ్పాటు ఉంటుంది. అందువలన ఈ నెలాఖరులోగా మీరు వేరే ఇంటికో, అపార్ట్‌మెంటుకో వెళ్ళక తప్పదు. ఈ మేరకు నేను నా భార్యకు చెప్పడం ఆమె వాళ్ళ తల్లిదండ్రులకు చెప్పడం జరిగింది. ఈ విషయంలో మీ సహకారం అర్థిస్తూ నెలాఖరుకల్లా ఆ పోర్షన్ ఖాళీచేయమని చెప్పడానికి చాలా విచారిస్తున్నాను"

**ఇట్లు మీ ప్రేమ పాత్రుడు**

**వంశీ.**

ఉత్తరం చదివి ఇందిర నిశ్చేష్టురాలయింది. ఇంత ఘోరమా! ఈ ఉత్తరం రాసింది వంశీ, తన పెద్ద కొడుకేనా? నమ్మశక్యంగా లేదు. కానీ వాడి దస్తూరీ అదే. భర్తకు కోపమొచ్చిందంటే రాదా? వీడికి తల్లిదండ్రుల కన్నా అత్తమామలే ఎక్కువైపోయారా? వీణ్ణి నమ్ముకుని తమకున్న చిన్న అపార్ట్‌మెంటు అమ్మి, భర్త రిటైర్‌మెంటు బెనిఫిట్సూ కలిపి మొత్తం 30 లక్షలిచ్చాం. ఈ ఇల్లు "జాయింట్ హక్కులతో రాయించుకోండి" అని నేను చెబితే వాడు "ఎందుకు నాన్నగారూ? నా మీద మీకా నమ్మకం లేదా? అదీగాక అలా రాయిస్తే నాకు ఇంటిమీద లోన్ రాదు. లోన్ లేకుండా నేను కొనలేను" అని చెప్పి నమ్మించి ఇప్పుడిలా ఇంటి నుంచి బయటకు వెళ్ళమంటున్నాడు. అదీ వాళ్ళ అత్తమామలను రప్పించి ఈ ఇంట్లో పెడతాడట. ఇది ఎవరికీ చెప్పుకోలేం. చెప్పుకుంటే ఎవరూ నమ్మరు, నమ్మినా సానుభూతి చూపరు కూడ.

మనసంతా వికలమయిపోయింది ఇందిరకు. వంట చెయ్యాలనే ధ్యాసేపోయింది. ఆయన చూస్తే అలా కుర్చీలో కూలబడిపోయాడు. పలకరించాలంటేనే భయమేస్తున్నది. రిటైరయ్యాక ఇటువంటి విపత్కర పరిస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఇందిర మంచం మీద వాలిపోయింది. ఇందిరకు హఠాత్తుగా మెలుకువ వచ్చింది. అప్పుడే టైము పన్నెండు దాటింది. ఆయనకు పన్నెండున్నరకల్లా భోంచేయటం అలవాటు. వెంటనే వంటకు ఉపక్రమించింది.

వంటయ్యేవరకు తను చూడలేదు కానీ రవి సోఫాలోనే నిద్రపోతున్నాడు. "లేవండి ఒంటిగంట దాటింది, భోం చేద్దురుగాని" "అరె, అంత టైమయిందా? నేను పన్నెండుగంటలలే పడుకున్నట్టు గుర్తు." ఇద్దరూ అయిష్టంగా తింటూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. తిని లేచారు. రవికి రిటైరయ్యాక భోం చేసిన వెంటనే నడుం వాల్చటం అలవాటయింది. ఇందిరకూ ఈ అలవాటొచ్చింది. మంచం మీద పడుకున్నాక రవే విషయం ఎత్తాడు.

"ఇందిరా! వంశీ ఇలా తయారయ్యాడేమిటి?"

"ఇదంతా వాడి భార్య ప్రోద్భలమండి. దానికి మన మీద ఏ మాత్రం ప్రేమాభిమానాలు లేవు, ఎప్పుడు దాని చూపు పుట్టింటి మీదే, వాళ్ళ ధ్యాసే. పెళ్ళయిన దగ్గరనుండి మనవాడు మనకు దూరమవుతూనే ఉన్నాడు. దానికిప్పటికి తన ప్లాను పూర్తిగా నెరవేరింది. ఏదో సామెత చెప్పినట్టు "కొట్టక్కరలేదు, తిట్టక్కరలేదు. చేస్తే సరి" అన్నట్టు మన వాడిచేతే మన కంట్లో పొడిపించింది. లేకపోతే వాడికెంత ధైర్యం. వాళ్ళ అత్తమామల కోసం మనల్ని బయటకు పొమ్మంటాడా?"

రవి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"నేనింతగా చెబుతున్నా మీరు ఒక్కమాటా మాట్లాడరే?"

రవి నోరు విప్పలేదు. అతనికి ఒక నిజం తెలిసినట్లున్నది.

"ఏంటండీ, మాట్లాడరు? ఇదంతా దాని పనేకదా! దాని మాటలు వినే మనకు దూరమైపోతున్నాడు?" ఇందిర మాట్లాడిన చాలాసేపటి వరకు రవి నోరు విప్పలేదు. "అవునవును, నువ్వన్నది నిజమేలా ఉంది."

"నిజమేలా ఉండటమేంటండీ, పచ్చి నిజం."

"అవును, ఇందిరా నేను కాలేజి చదువూ, ఆఫీసు పనులూ తప్ప ఇతర పుస్తకాలు ఎక్కువగా చదవలేదు. ఏదో సందర్భంలో మా నాన్నగారి లైబ్రరీ పుస్తకాల్లోని ఒక దాంట్లో "చరిత్ర పునరావృతం అవుతుంది" అని ఉంది. అప్పుడు నాకది అర్థం కాలేదు, కానీ ఇప్పుడు బోధపడింది."

"పెద్ద సమస్య వచ్చి మన కొంపమునుగుతుంటే చరిత్ర, సైన్సు అంటారేమిటండీ?"

"అదే, ఇందిరా! చరిత్ర పునరావృతమవుతుంది" అని అంటున్నాను.

"ఎవరి చరిత్ర, పునరావృతమవ్వడమేమిటి? ఈ స్టేట్‌మెంట్‌కి మన సమస్యకి సంబంధమేమిటి?"

"నువ్వు, చాలా తెలివైనదానివి. ఎంతో ముందుచూపు గలదానివి. కొంచెం ఆలోచించు, నేను చెప్పిన స్టేట్‌మెంట్‌కి మన సమస్యకి ఉన్న సంబంధం నీకు అర్థమవుతుంది" ఇందిరకి ఏమ్మాత్రం అర్థమవడంలేదు, ఆయన మాటల్లోని అంతరార్థం.

కొంతసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

ఇందిరకి హఠాత్తుగా ఒక విషయం తట్టింది. దానితో ముచ్చెమటలు పోశాయి. బహుశా ఆయన ఉద్దేశ్యం 'అది'కాదుకదా! అవును 'అదే' అయివుంటుంది. ఏమిటది? ఏమా చరిత్ర దాని పునరావృతం అవడం? ఈ ఆఖరి మాటలు ఇందిర తనలో తాననుకున్నా అవి పైకే వచ్చేశాయి. "మళ్ళీ చెబుతున్నాను. నా చేత చెప్పించడం ఎందుకు? నువ్వే ఆలోచించు ఇందిరా, నీకే అర్థమవుతుంది" అవును సూచాయగా అర్థమవుతునే ఉంది. కానీ అంగీకరించడానికి, పైగా పైకి తన అంగీకారం చెప్పడానికి అహం వప్పుకోదు. ఇదేదో ముసుగులో గుద్దులాటెందుకని ఆయన చేతే చెప్పిద్దాం.

"నాకేం అర్థమవడం లేదండీ. మీరు చెప్పినదానికి మన ప్రస్తుత సమస్యకి సంబంధం ఏమిటో?"

"ఉంది, ఇందిరా అది నీకూ తెలుసు. అయినా నా చేత చెప్పించాలని చూస్తున్నావు. చెబుతాను తప్పక చెబుతాను. చరిత్రంటే ఏమిటో నీకు తెలుసు, యస్.య్స్.ఎల్.సిలోనూ, ఇంటర్‌మీడియట్‌లోనూ, బి.ఎలోనూ నువ్వు చరిత్ర చదివావు. చరిత్ర అంటే గడిచిపోయిన సంఘటనల సారాంశం. చరిత్ర అంటే గత అనుభవాల ఆస్థి. చరిత్ర మానవ సమాజానికి భవిష్యత్ సూచిక. చివరగా, చరిత్ర - మనం చేసిన తప్పిదాల్ని సరిదిద్దుకునే ప్రయోగశాల.

"ఇక చరిత్ర పునరావృతం" అనే మాటని మొదటగా చెప్పినవాడు "కాలిన్‌వుడ్" అనే బ్రిటిష్ చరిత్రకారుడు.

"హిస్టరీ రిపీట్స్ ఇట్ సెల్ఫ్" అనేది ఆయన చెప్పింది. ఇందిరకి అంతా అర్థమయింది. కానీ అర్థమయిందానిని అర్థమయినట్లు చెబితే ఆమె ఇందిర ఎందుకవుతుంది?

"చాలు మీ చరిత్ర పాఠాలు. మీ పాఠాలకి మన ప్రస్తుత సమస్యకి సంబంధం ఏమిటో చెప్పండి అది చాలు."

"మనం చేసిన తప్పిదం ఇప్పుడు మనమీద ప్రయోగింపబడుతోంది" రవి ఇంతవరకూ చెప్పి మిన్నకున్నాడు. కొంతసేపయ్యాక, ఏం అర్థం కానట్టు ముఖం పెట్టి "అంటే?" అంది ఇందిర.

"ఇంతకన్నా వివరణ చెప్పాలిసిన అవసరం లేదనుకుంటున్నాను. అయినా నువ్వింతగా అడుగుతున్నావు గనుక, నాకు తోచిన వివరణ ఇస్తున్నాను ఇచ్చే ముందు ఒకటి అడుగుతాను చెప్పు."

"ఏమిటది?"

"మన కోడలు, వంశీ భార్య రాధిక తన పుట్టింటి వాళ్ళనే తప్ప మనల్ని పట్టించుకోవడంలేదు. వాడి మనస్సు తన పుట్టింటి వాళ్ళ వైపుకు మరల్చడంలో జయప్రదం అయింది. అవునా?"

"అవును. ఈ మాట నేను ఇంతకు ముందే చెప్పానుగా?"

"ఆ తప్పే మన వైపునా జరిగింది. వాడూ ఎంతయినా మన సంతానమే కదా? వాడికీ మన బుద్ధులే అబ్బటంలో

ఆశ్చర్యమేముంది? ఇప్పుడయినా బోధపడిందా, ఇంకా వివరాల్లోకి వెళ్ళాలా?" ఇందిర మ్రాన్పడిపోయింది. నోట మాటలేదు. ఇంకా వివరణ ఎందుకు, భర్త అంత మాట అనేశాక!

## 2

ఇందిరకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. నిద్ర నటిస్తూ గతంలోకి జారిపోయింది.

భర్తకి సాహిత్యం మీద ఏ మాత్రం ఆసక్తిలేదు. రోజూ ఇంగ్లీషు పేపరు అక్కడక్కడా చదవడం వరకే, ఆయన పఠనం. పిల్లల్ని స్కూలుకు పంపేశాక, రవి ఆఫీసుకు వెళ్ళిపోయాక తన పని పుస్తక పఠనమే. రవి ఉద్యోగం ఎక్కువ భాగం తెలుగుదేశం కాకపోయినా, తెలుగు పత్రికలు దొరికే పొరుగు రాష్ట్రాలే. అందుచేత ఇందిర చాలా పత్రికలు చదువుతుంది. కొన్ని కొని, కొన్ని లైబ్రరీలోనూ. తనకు ఈ అలవాటు చిన్నప్పటి నుండీ ఉంది. బి.ఎలో తనది లిటరేచర్ సబ్జెక్టవడం తన పుస్తక పఠనానికి మరింత తోడ్పడింది. ఈ మధ్యనే 'చినుకు' పత్రికలో చదివిన ఒక కవిత ఆమెను ఆలోచింపజేసింది.

అన్ని వివాదాలు / విభేదాలకు / కారణాలు / రెండే కాంప్లెక్సులు.

సుపీరియారిటీ / ఇన్ఫీరియారటీ

ఇదెంత నిజం.

రవితో తనకు పెళ్ళయ్యేసరికే అతనొక ఆఫీసర్, ఆంధ్రాబ్యాంకులో. తన మామగారయితే స్టేట్ బ్యాంకులో అప్పటికే సీనియర్ ఆఫీసర్. తన కుటుంబ పరిస్థితి ఆర్థికంగా పటిష్టస్థితిలో ఉన్నా తండ్రి స్టేట్ గవర్నమెంటులో చిరుద్యోగి, కనీసం గుమస్తాకూడా కాడు. అంతే పెళ్ళయినప్పటినుండి, ఆ మాట కొస్తే పెళ్ళి నిశ్చమైనప్పటి నుండి తనకు అత్తవారి వైపున అందరి మీద ఒక రకమైన వ్యతిరేక భావముండేది. దానికి కారణమేమిటో తనకు తెలిసేది కాదు. తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు తన అత్తమామలను, భర్తను, ఆయన సోదరులను, ఆడపడుచునీ ఎంతో గౌరవించేవారు. వాళ్ళూ తన తండ్రి ఎంత చిన్న ఉద్యోగి అయినా ఆ భేదభావం చూపించేవారు కాదు. తనకు ఈ వ్యతిరేక భావం, కారణం ఏమిటో పైన చెప్పిన కవిత చదివాక అర్థమయింది. అర్థమయ్యాక తనకే అసహ్యమేసింది, తన ప్రవర్తన మీద అయినా 'నౌ ఇటీజ్ టూ లేట్'. వెనక్కి తీసుకునే అవకాశం ఏ మాత్రం లేదుగాక లేదు. 'సుపీరియారిటీ' 'ఇన్ఫీరియారిటీ', 'కాంప్లెక్సు'లు అంటే ఏమిటో డిక్షనరీలో ఏముందో సరిగా తెలుసుకోవాలని చూసింది. వాటి భావాలు ఇలాగున్నాయి.

కాంప్లెక్సుల భావం అర్థమయ్యాక తన ప్రవర్తన పూర్తిగా అర్థమయింది. తనది ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. అందుకే తన అత్తమామలు ఏం మాట్లాడినా తనకు కోపం, చికాకు. కానీ తన భర్తతో కాపురం చెయ్యక తప్పదు. అందువలన తన అత్తవారిని, ఆ కుటుంబ సభ్యులను తన భర్తకు దూరం చెయ్యడం. ఇదీ తన ప్రాజెక్టు. దీని అమలు పెళ్ళి అయిన మరునాటి నుండీ స్టెప్ బై స్టెప్ మొదలుపెట్టింది. చాలా జయప్రదంగా అమలు చేస్తున్నందుకు అప్పుడప్పుడూ తలుచుకుని తనలో తనే నవ్వుకునేది. పిల్లలూ, ఆయనా అడిగేవారు "ఎందుకు నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" అని.

ఇంకో నవ్వు నవ్వి 'అబ్బే ఏం లేదు' అని సమాధానం చెప్పి వివరాల్లోకి వెళ్లేది కాదు. అయినా ఇటువంటి వంకర పనులు ఇతరులకు చెప్పేవా? కానే కాదు కదా!

రవి ముగ్గురన్నదమ్ముల్లో పెద్దవాడు. తన పెద్దమరిదీ స్టేట్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్. చిన్నమరిది ప్రైవేట్ ఉద్యోగమైనా నెలకు లక్షరూపాయల జీతం. అతను నాలుగేళ్లు అమెరికాలో ఉండి వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. ఇక తన ఆడపడుచు కూడా స్టేట్ బ్యాంకులో ఆఫీసరే. ఆమె భర్త సెంట్రల్ అండర్ టేకింగ్లో ఇంజనీరు.

ఇక తనవైపు చూస్తే తన బావది వ్యాపారం. తన పెద్ద అన్నయ్య పోస్ట్ మెన్. రెండవ అన్నయ్య, తన ఇద్దరు తమ్ముళ్లు  చిరుద్యోగులు. తండ్రి సంగతి సరే సరికదా.. చిరుద్యోగి!

తన వైపు వాళ్లను అత్తవారి వైపు వాళ్లతో పోలిస్తే ఎంత తేడా ! వాళ్ల అఫీషియల్ పోజిషనెక్కడ తన వాళ్ల చిరుద్యోగాలు ఎక్కడ?

తనకు కోపంగా ఉండంటే ఉండదా మరి! తాను కోపమనే అంటుంది. కిట్టని వాళ్లు అసూయంటారు.

రవి ఉద్యోగం కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లోనే సాగింది. అయినా ఆయన తల్లిదండ్రులు, అన్నదమ్ములు అందరూ ఆంధ్రాలోనే ఉద్యోగం. బెంగుళూరు, చెన్నయ్, నాగపూర్లకు విజయవాడకూ ఎంత దూరం? అయినా ఇరు కుటుంబాల మధ్య రాకపోకలు లేకుండా జాగ్రత్తపడేది తను. తన తల్లితండ్రులూ, అన్నదమ్ములూ అందరూ ఉండేది ఏలూరులోనే ఏలూరు వెళ్లడానికి విజయవాడ మీదుగానే వెళ్లాలి. అయినా వీలనంతవరకు విజయవాడలో దిగకుండా ప్రయాణం ప్లాన్ చేసేది. ఎప్పడయినా తప్పని పరిస్థితుల్లో అత్తవారింటికి వెళ్లి ఒక రోజు . ఉంటే వచ్చే రోజున ఏదో వంక పెట్టి కయ్యం వేసేది. ఈ దెబ్బలాట ఎందుకు వస్తున్నదో అమాయకుడు తన భర్తకుగాని, అత్తమామలుకు గాని అర్థమయ్యేది కాదు. తనవన్నీ ముందే తయారుచేసిపెట్టుకున్న ప్లానులు గనుక వాళ్ల మేధస్సుకు అందేవి కావు.

ఇక ఆడపడుచుని చూస్తే తనకే కాదు. భర్తకూ అసూయ పుట్టించేటట్ల వాళ్ల మీద లేనిపోని చాడీలు చెప్పి తమకూ వాళ్లకూ – కనీసం వాళ్ల పిల్లలకూ తమ సంతానానికీ కూడా దూరం మెయిన్టెయిన్ చేసేది, జయప్రదంగా...!

ఇక తన మామగారు. పెద్ద ఆఫీసరే కాదు, గొప్ప కవీ, రచయితా కూడాను. నీతి బోధలు చేస్తూ తమకు ఉత్తరాలు రాసేవారు. వాటిని తన తెలివంతా ఉపయోగించి నెగెటివ్ వ్యాఖ్యానాలు చేసేది. పాపం రవి తన బుట్టలో అతి సులువుగా పడేవాడు. యేతావాతా ఏమిటంటే తన భర్తకూ అత్తమామలకూ, మరుదులకూ, ఆడపడుచుకూ మధ్య దూరం క్రమ క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఇక రాకపోకలయితే చాలా చాలా తక్కువ.

పెళ్లయిన అయిదారేళ్లలో తాము బెంగుళూరులో ఒక చిన్న అపార్ట్మెంట్ తీసికోవడం జరిగింది. అది ఆ రోజుల్లో పెద్ద చెప్పకో దగ్గ రేటు కాదు. అయినా రవి దగ్గర కొనడానికి అంత డబ్బులేదు. మామామగారిని అడుగుతానన్నాడు. తను వెంటనే తన వస్తువులు అమ్మి అపార్ట్మెంట్ తీసికోమని, వాళ్లనడిగితే లోకువయిపోతామని చెప్పి ఒప్పించి ఆ ప్రకారం చేసింది. గృహప్రవేశానికి తన అత్తమామలు, మరుదులు, ఆడపడుచూ, ఆమె భర్త వాళ్ల పిల్లలూ అందరు వచ్చి ఫంక్షన్లో పాల్గొన్నారు.  వాళ్లతో భర్త కలువకుండా వీలయినంత వరకూ జాగ్రత్త పడింది. ఎంతో సందడిగా, హృదయపూర్వకంగా వచ్చిన అత్తవారి తరపున బంధువులందరూ ఫంక్షన్ అయ్యాకా ఒక రోజు గడిపి వెళ్లిపోయారు. ఆ వెంటనే వాళ్ల మీద లేనిపోని నేరాలు మోపుతూ ఒక పెద్ద ఉత్తరం రాసింది.  అ ఆపూర్వ కలయికని కకావికలు చేస్తూ రాసిన ఉత్తరానికి వాళ్ల దిమ్మ తిరిగిపోయింది. మరి వాళ్లు జన్మలో తమ దగ్గరకు రాకుండా చేయడంలో గెలుపు సాధించినందుకు గర్వంతో నవ్వుకుంది.

తన మామగారు గొప్ప కవీ రచయిత కదా! తెలుగు సాహిత్యాన్ని కూలంకషంగా చదివితే కాని రచయిత కాలేదు. ఆయనకి "పఠనం జబ్బు" చిన్నప్పటి  నుండే ఉన్నదట! ఆయన స్వంతంగా కొన్ని రచనలు చేసి పుస్తకాలు ప్రచురించేవారు. తన స్వీయచరిత్ర కూడ రాసి కవి పండితుల విమర్శకుల మెప్పు పొందారు. ఆ పుస్తకాన్ని అనేక పత్రికలు సమీక్షించి ప్రశంసించాయి. ఇక్కడే ఆయన తప్పులో కాలేశాడు. స్వీయచరిత్ర  అంటే నిజాలే వ్రాయాలి, పూర్తి నిజాలే రాయాలి. అబద్ధాలు, హాఫ్ ట్రూత్స్ రాసేవారు అసలు స్వీయ చరిత్ర రాయనేకూడదు. ఈ సంగతి ఆయన రాసిన పుస్తకం ముందు మాటలోనే చెప్పడంతో తనకు తెలిసింది. అందరూ మెచ్చుకున్న పుస్తకం కదా అని దానిని తన భర్తకు, ఆఫీసు అడ్రస్సుకు పంపేరు,  నిజాలు రాసేటప్పుడు తన గురించి తనకు తెలిసిన నిజాలు అన్యాపదేశంగా వేరే పేరు పెట్టి వ్రాయడం జరిగింది. ఎంతయినా భార్యను కదా, దానికి ఆయనకూ కోపం వచ్చింది. ఈ కోపం ఎంతవరకూ పోయిందంటే పుస్తకంతో తన (రవి) గురించి రాసిన

అభినందన పూర్వక విషయాలు మరుగున పడిపోయాయి. ఆ పుస్తకాన్నింటికి తీసుకుని వచ్చి తన కిచ్చేరు. ఆ పుస్తకం చదివితే తన కెంతో సంతోషమేసింది. తనకి వ్యతిరేకంగా రాసినా కాని – ఈ రూపంగా తండ్రి కొడుకుల మధ్య చిచ్చుపెట్టడానికి – అదే చాలా పెద్ద అంతరం సృష్టించడానికి ఈ పుస్తకం ఎంతగానో తోడ్పడింది. దానితో ఆయన అప్పటి వరకూ అప్పడప్పుడు వెళ్లి చూసి ప్రక్రియ చాలా భాగం ఆగిపోయింది.

మామగారికి మరో రకం వ్యసనం ఉంది. ఎక్కడో చదివింది. వ్యసనాలు మంచివీ, చెడ్డవీ కూడ ఉంటాయట. చెడ్డవేంటో అందరికీ తెలిసినవే. ఇక ఆయన ఈ వ్యసనం చాల మంచిదని ఆయన అభిప్రాయం. అంతవరకే కాదు. చాలా చోట్ల చదివాను కూడ. ఇంతకీ ఆ వ్యసనం బంధుమిత్రులు తరచూ కలుసుకుంటూండాలట. దాని కోసం కొన్ని ఫంక్షన్స్ చెయ్యాలట. కొన్ని ఫంక్షన్స్ సృష్టించాలట. దీని వలన అందరికీ ఆయురారోగ్యాలు పెరుగుతాయట. ఇంకా వివరంగా చెప్పాలంటే ఈ సబ్జెక్టు మీద ఆయనొక రైటప్ ని తన బంధువులకి పంపేవారు. మాకూ ఒకటి వచ్చింది. దాని సారాంశం నేను పైన చెప్పిందే.

ఈ వ్యసనానికి తోడు ఆయన ఒక సిటి లయన్స్ క్లబ్ సంస్థకు అధ్యక్షుడు. ఈ సంస్థలో సాంస్కృతిక విభాగానికి ఆయన ఇన్చార్జ్ దీని తరపునా అనేక సమావేశాలు, సభలు జరిపేవారు. ముఖ్యమైన వాటికి తమకూ ఆహ్వానాలు వచ్చేవి. ఇంటి అడ్రసుకు వస్తే రవికి అందకుండా చింపేసే ది తను.

ఇక గృహఫంక్షన్స్ కీ ఇదే గతి. ఆయన ఫోనులో రవికి చెబితే ఆయన పట్టించుకునేవాడు కాదు. పైపెచ్చు ఆఫీసు పనిలో పడి మరిచిపోయేవాడు. ఆయన మతిమరుపు తనకు బాగా పనికి వచ్చింది, ఇరు కుటుంబాల మధ్య అంతరం పెంచడానికి!

ఓ సారి మామగారు తమ పరిణయ రజతోత్సవం జరుపుకున్నారు. తను వెళ్లలేదు. రవి హాజరయ్యేడు. ఆ తతంగమంతా ఫోటోలు, వీడియోలతో చాల ఘనంగా జరిపేరట. ఆ సందర్భంలోనే మామగారొక కవితా సంపుటిని తీసుకుని వచ్చారు. సభలో చదివిన అభినందనలన్నీ ఆ పుస్తకంలో వచ్చేయి కూడా ! పెద్ద డిన్నర్తో ఫంక్షన్ ముగింపు, ఇందతా ఒక కళ్యాణ మండపంలో ! రవి ఎంతో సంతోషంతో తిరిగి వచ్చి 'నువ్వెంతో మిస్సయ్యావు ఇందిరా ! మన పిల్లల్ని నిన్నూ తీసుకుని రాలేదని నన్ను అనేక మంది అడిగితే సమాధానాలు చెప్పలేక ఎంత సతమతమయ్యేను తెలుసా?' అన్నాడు.

తనలోతాను గొణుక్కుంది..

"ఏం మాట్లాడవు ఇందిరా? ఈ సారి జరిగే అన్ని ఫంక్షన్స్కి మనం కుటుంబసమేతంగా వెళ్లాలి సుమా!"

కొంతకాలం పోయాక పెద్ద మరిది గృహప్రవేశం, అత్తమామల వైవాహిక స్వర్ణోత్సవం కలిసివచ్చేటట్లు మరో పెద్ద ఫంక్షన్.. తనకు హఠాత్తుగా గుండెనొప్పిని తెప్పించుకుని హాస్పిటల్లో జాయినయింది. పాపం, ఇంకేం ప్రయాణం ! ఇలాగే మామగారికి సప్తతి (70 సంవత్సరాలు నిండాక), అమృతోత్సవం, అమృతోత్సవం అయితే చాలా హైలెవలో గొప్ప కాస్ట్లీ కళ్యాణమండపం వేదిక, భారీ ఎత్తున ఏర్పాట్లు, ఆ సమయంలోనే మామాగారి 5 పుస్తకాల ఆవిష్కరణ, సమీక్షలు. సుప్రసిద్ధులయిన కవులూ, రచయితలూ, దూరంలో ఉన్న బంధువులూ, మిత్రులూ, ఒక్క హైదరాబాదు నుండే బంధుమిత్రులు యాభై మంది దాకా వచ్చేరట. దానికి తన శక్తినంతా ఉపయోగించి ఈ సారి వంశీకి జబ్బుతెప్పించి, దుమ్మా కొట్టించింది. ఫైనల్గా అత్తమామల వైవాహిక వజ్రకోత్సవం. ఇదీ పెద్ద ఎత్తున జరిగింది. ఫంక్షన్కి కావలిసిన ఆడవాళ్లకి, మగవాళ్లకి పెటుబడుల బట్టలు రవినే కొనమని పురమాయించారు. 4 రోజుల ముందే ఆయన చేత ఫోను చేయించి "అక్కడే కొనండి, డబ్బులు నేనిస్తాను" అనిపించి ఎగ్గొటించింది తాను. ..ఇలానే మామగారి కుటుంబానికి రవిని దూరం చేసింది... తనే కదా!

రాత్రి 12 గంటలు కొట్టింది. రవి అసౌకర్యంగానే అయినా, నిద్రపోతున్నాడు. వంశీతో రేపు మాట్లాడి ఈ గడ్డు సమస్య నుండి గట్టెక్కాలి. ఆలోచనలు, తలపోతలతో టైము గడచిపోవడంతో నిద్ర వెంటనే పట్టేసింది.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments